క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్స్‌లో సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు బుధవారం దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డీటీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు దుప్పట్లు అందజేయడం అభినందనీయమన్నారు. సహారా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి యస్దానీబాషా మాట్లాడుతూ దివంగత రాధాకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పుచ్చలపల్లి సతీష్‌కుమార్‌రెడ్డి సహకారంతో దుప్పట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సైనా, సంధ్యా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



జయహర్షను అభినందిస్తున్న శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిశోధన విద్యార్థిని జయహర్షకు డాక్టరేట్‌ను వర్సిటీ ప్రదానం చేసింది. బయోటెక్నాలజీ అధ్యాపకుడు శ్రీకన్యరావు పర్యవేక్షణలో సమగ్ర పరిశోధన చేయడంతో డాక్టరేట్ లభించింది. ఆమెను వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తదితరులు అభినందించారు.

పీ4లో భాగస్వామ్యం కావాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అభివృద్ధి చెందిన కుటుంబాలు పీ–4 కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పాల్గొని, మాట్లాడారు. వివిధ రూపాల్లో సహాయం అందించనున్న మార్గదర్శికి, బంగారు కుటుంబానికి మధ్య ప్రభుత్వం సంధానకర్తగా నిలిచి చిన్న చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. బంగారు కుటుంబాల భవిష్యత్తును అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తోటపల్లిగూడూరు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ఇందుకూరుపేట ప్రాజెక్ట్ అడిషనల్ సీడీపీఓ రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విలుకానుపల్లి (ఎస్సీ) అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు మల్లికార్జునపురం (ఎస్టీ), వరకవిపూడి – 1 (ఎస్సీ), సౌత్‌ఆములూరు – 2 (ఓసీ), కొత్తకోడూరు – 2 (ఎస్సీ), కోడూరు ఏడబ్ల్యూ (ఎస్సీ) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి.. 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు గల వారు అర్హులని, స్థానిక గ్రామాల్లో వివాహితులై ఉండాలని చెప్పారు. అర్హులు ఐసీడీఎస్ ఇందుకూరుపేట ప్రాజెక్ట్ కార్యాలయంలో తమ దరఖాస్తులను ఈ నెల 26లోపు అందజేయాలని కోరారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారీగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎస్ఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపడుతూ, 24 గంటల్లోపు డంపింగ్ యార్డులకు తరలించేలా పర్యవేక్షించాలని తెలిపారు. తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, మలేరియా విభాగం అధికారి జీజియా బాయి, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

కొడవలూరు: ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కొత్తవంగల్లు, యల్లాయపాళెంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి వరి పంట సాగు చేస్తున్నారు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్న వివరాలను విధిగా ఈ–క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. పంట నమోదైన రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు, ప్రభుత్వ రాయితీలకు అర్హులవుతారని చెప్పారు. పంట నమోదు కాని రైతులు సంబంధిత వీఏఏను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకట్రావు, వీఏఏ చైతన్య, రైతులు పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో..

⇨ విడవలూరు: మండలంలోని ముదివర్తి రైతు సేవా కేంద్రంలో ఏఓ లక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వినీత, కోవూరు ఏడీఏ అనితతో కలిసి ఆమె పంచాయతీ పరిధిలోని చెలికల, గాంధీనగర్ గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. వేరుశనగ రైతులు మోతాదును మించి విత్తనాలు వాడుతున్నారని, వీలైనంత వరకు తగ్గించాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు సాయిలక్ష్మి, వెన్నెల, స్థానిక రైతులు పాల్గొన్నారు.

⇨ కోవూరు: మండలంలోని లేగుంటపాడు, మోడెగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త వినీత స్థానిక వరి పొలాల్లో పరిశీలించి, రైతులకు ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణపై సూచనలు చేశారు. వరి పంటలో మోతాదుకు మించి భాస్వరం, ఎరువుల వాడకం వల్ల వాతావరణ కాలుష్యం, చీడపీడల వ్యాప్తి, భూసారం తగ్గుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, మండల ఏఓ రజని, సిబ్బంది కీర్తన, మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

⇨ మనుబోలు: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలను నిర్వహించి నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య సూచించారు. మనుబోలులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.



మనుబోలులో..



కోవూరులో..



విడవలూరు: పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కాకాణి పూజితకు అభినందనలు

పొదలకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితను మండలంలోని బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, సర్వేపల్లి ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్ బుధవారం అభినందించారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మరిన్ని పదవులను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని కాంక్షించారు.



తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కొడవలూరులో గర్భిణులకు సీమంతాలు

తోటపల్లిగూడూరు: ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ లలితాంబ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని తోటపల్లి పంచాయతీ కామాక్షినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు ఐదేళ్ల పాటు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణప్రియ, సక్కుబాయి, విమలమ్మ, భాగ్యమ్మ, పోలమ్మ, సుభాషిణి, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలనే పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కొడవలూరు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలను పట్టించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లి కూడా ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమీజా, యాస్మిన్, నాగరాజమ్మ, కామేశ్వరి, శాంతి, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

⇨ మనుబోలు: తల్లి పాలకు మించిన ఔషధం బిడ్డకు లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ పేర్కొన్నారు. పిడూరుపాళెం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు సంపూర్ణ, సుబ్బమ్మ, రాధ, ముత్యాలమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..

⇨ వెంకటాచలం: తల్లి పాలు బిడ్డకెంతో మేలు చేస్తాయని సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కసుమూరు – 2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం సుశీల, అంగన్‌వాడీ టీచర్లు ఆయేషా, మస్తానమ్మ, మాధవి, లక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో..



వెంకటాచలం: కసుమూరులో..

సామూహిక కుంకుమార్చన రేపు

ఇందుకూరుపేట: వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌స్వామి బుధవారం తెలిపారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు జరుపనున్నట్లు చెప్పారు.

కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణాల పూర్తి

పొదలకూరు: గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ల ద్వారానే పనులను పూర్తి చేయించేలా చూస్తున్నామని ఎంపీడీఓ నరసింహరావు పేర్కొన్నారు. కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ మహేష్‌తో కలిసి బుధవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓతో సంబంధిత కాంట్రాక్టర్లు మాట్లాడారు. పట్టణానికి చెందిన లబ్ధిదారులకు చిట్టేపల్లి తిప్ప వద్ద 1400 ప్లాట్లను పంపిణీ చేశారని, ఇందులో 250 ఇళ్లకు బేస్‌మెంట్లను నిర్మించగా, మిగిలిన వాటికి స్లాబులను పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ లేఅవుట్‌పై విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ముందుగా దాని పరిస్థితిని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించనున్నామని వెల్లడించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: గేదెను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నిడిగుంటపాళెం నుంచి సర్వేపల్లి వైపు బైక్‌పై రవికిరణ్ బయల్దేరారు. ఈ క్రమంలో ఇస్కపాళెం సమీపంలో గేదె అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని నెల్లూరు తరలించారు.

రేపట్నుంచి గంగమ్మ తల్లి కొలుపు

పొదలకూరు: పట్టణంలోని శివాలయ వీధిలో కొలువైన గంగమ్మతల్లి దేవస్థానంలో కొలుపు మహోత్సవాన్ని శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది. విశేష పూజా కార్యక్రమాలను జరపనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర ఇన్‌చార్జిగా పద్మాకర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన ఊదూరు పద్మాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు పెద్ద అల్లాభక్షు బుధవారం ఆయన్ను అభినందించి, మాట్లాడారు. పద్మాకర్ మరెన్నో పదవులు పొంది సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు నరసాపురం విద్యార్థినులు

ఇందుకూరుపేట: ఈనెల 9 నుంచి బాపట్లలో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని ప్రసన్న, పదో తరగతి విద్యార్థిని పి.జ్యోతి లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో వారిని సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో వారిని హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

సకాలంలో టీకాలు వేయాలి

కొడవలూరు: పిల్లలకు సకాలంలో టీకాలు వేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదేనని కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ సూచించారు. మండలంలోని కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నెలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు వయస్సు ఆధారంగా టీకాలు విధిగా వేయాలన్నారు. పోలియో, కోరింత దగ్గు తదితర ప్రమాదకర వ్యాధులకు టీకాలు అందుబాటులో ఉన్నందున ప్రతి చిన్నారికీ సకాలంలో వేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్ఏ ఒ.సుధాకర్, ఏఎన్ఎం టి.రాధమ్మ ఉన్నారు.



గుర్రాలదిన్నెలో వ్యాక్సినేషన్ను పరిశీలిస్తున్న వైద్యాధికారి

ఒకే ఇంట్లో ఇద్దరికి కానిస్టేబుల్ ఉద్యోగాలు

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఊటుకూరు పంచాయతీ కంచరపాళెం గ్రామానికి చెందిన అల్లూరు సుబ్బరాయలు–వరలక్ష్మి దంపతుల ఇద్దరి కుమార్తెలు రాధా, లక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలను కైవసం చేసుకున్నారన్నారు. వారిని కళాశాల విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, ఇతర అధ్యాపక సిబ్బంది విద్యార్థులు వారికి అభినందనలు తెలియజేశారు.



అల్లూరు రాధా



అల్లూరు లక్ష్మి

ఆలయ భూములను పరిరక్షించాలి

ముత్తుకూరు(పొదలకూరు): ఈపూరు పంచాయతీలోని విరూపాక్ష స్వామి ఆలయ భూములను పరిరక్షించాలని దేవదాయ శాఖ ఈఓ భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ స్వప్నను బుధవారం కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయ భూముల సర్వే నంబర్లలో ప్రైవేట్ వ్యక్తుల పేర్లున్నాయని చెప్పారు. రీ సర్వేలో వీటిని తొలగించాలని కోరారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఈఓ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మనుబోలు: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. డ్రగ్స్‌తో సంభవించే దుష్పరిణామాలు, గుడ్.. బ్యాడ్ టచ్‌పై మండలంలోని అక్కంపేట ఎన్నెస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వీటిని ఎవరైనా వినియోగిస్తున్నారని తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పేదలకు నివేశన స్థలాలివ్వాలి

ముత్తుకూరు(పొదలకూరు): పేదలకు నివేశన స్థలాలను అందజేయాలని సీపీఐ మండల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఏడుకొండలు మాట్లాడారు. మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేసినా, పేదలకు ఉద్యోగావకాశాలను కల్పించడంలేదని చెప్పారు. సమగ్ర సర్వేను నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ముజీబ్‌బాషా, వెంకటరమణయ్య, సూర్యనారాయణ, శ్రీహరి, కృష్ణయ్య, ప్రసాద్, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కను దారుణంగా చంపారు

• ఫిర్యాదు చేసిన బాధితులు

విడవలూరు: కోడిపిల్లను కరిచిందనే నెపంతో కుక్కను దారుణంగా పొడిచి చంపాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వావిళ్ల గ్రామం దళితవాడకు చెందిన పాటూరు కాటయ్య–ఆదిలక్ష్మమ్మ దంపతులు నాలుగేళ్ల నుంచి వారి ఇంట్లో ఓ కుక్కను పెంచుకుంటున్నారు. బుధవారం సొంత పనుల నిమిత్తం ఆదిలక్ష్మమ్మ తన భర్తతో కలిసి నెల్లూరుకు వెళ్తూ కుక్క బాధ్యతలను ఇంటి దగ్గర ఉన్న ఆమె అత్త సీతారామమ్మకు అప్పగించింది. ఈ క్రమంలో పక్కింట్లో ఉంటున్న మడపర్తి సుధాకర్ అనే వ్యక్తి తమ ఇంటికి వచ్చి ఇంట్లో కట్టేసి ఉన్న కుక్కను ఇనుప గునపంతో పొడవగా కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఎందుకు పొడిచావంటూ సీతారామమ్మ ప్రశ్నించగా తన ఇంట్లో ఉన్న కోడి పిల్లలను తినేసిందంటూ సమాధానం ఇచ్చాడు. అంతలో నెల్లూరు నుంచి వచ్చిన ఆదిలక్ష్మమ్మ తాను ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న కుక్క చనిపోయి ఉండడం చేసి కన్నీరు పెట్టుకుంటూ, చనిపోయిన కుక్కను తీసుకోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



చనిపోయిన కుక్కతో ఆదిలక్ష్మమ్మ

‘గురుకులం’ ప్రిన్సిపల్‌పై చర్యలు చేపట్టాలి

నెల్లూరు(అర్బన్): కలుషిత ఆహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనలో తోటపల్లి గూడూరు మండలం కొత్తకోడూరు గ్రామంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న పాఠశాలకు చెందిన ఇద్దరి విద్యార్థినులను బుధవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్, సురేంద్ర, బీపీ నరసింహ, వంశీ పరామర్శించారు. హాస్టల్‌లో జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారం, తాగునీరు సక్రమంగా లేకపోవడంతో సోమవారం 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారన్నారు. అయితే ఆ విషయాన్ని దాచిపెట్టి మంగళవారం రాత్రి వరకు ఆస్పత్రికి తీసుకుని రాకపోవడం దారుణమన్నారు. నిర్లక్ష్యంతో వ్యవహరించడమే కాకుండా ప్రశ్నించిన విద్యార్థి సంఘం నాయకులను ఈవిషయాన్ని ఇంతటితో వదిలేయమని చెప్పడం తగదన్నారు. సంబంధిత ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, కలుషితం లేని ఆహార పదార్థాలు అందించేలా చూడాలన్నారు.



బాలికను పరామర్శిస్తున్న విద్యార్థి నాయకులు